RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే

దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 266

గురువారం, సెప్టెంబర్ 10, 2026, పేజీలు - 4 వెల : 2/-

**మంచిమాట**

తమ సమస్యలను నీతో పంచుకునే వారిని చిన్నచూపు చూడకు... నీకు చెప్పడం వారు అసమర్థులై కాదు, నీమీద నమ్మకంతో.

## కేసీఆర్ కుటుంబాన్ని సామాజిక
# బహిష్కరణ చేయాలి

**: సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 9 :కేసీఆర్ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎర్రవల్లిలో శుద్ధి పేరుతో కేసీఆర్ దళితులను అవమానించారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎదుట తొలి రోజు చోటు చేసుకున్న ఘటనపై ప్రత్యేక విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. విచారణ అధికారిగా విజయ్ కుమార్ ను నియమి స్తున్నట్లు వెల్లడించారు. దీని వెనక ఉన్న బాధ్యులను గుర్తించి కోర్టు ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.
"కాంగ్రెస్ పార్టీ అంటే దేశంలో కోట్లాది ప్రజలకు ఒక నమ్మకం,



ఒక భరోసా.. కాంగ్రెస్ ఏం చేసిందని అడిగేవారు.. పాకిస్థాన్, బంగ్లాదేశ్ లను ఒకసారి పరిశీలించాలి. కాంగ్రెస్ దూరదృష్టితో ఏ రకంగా ఈ దేశం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుందో అర్థమవుతుంది. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లను కల్పించింది కాంగ్రెస్ పార్టీ. ఇది కాంగ్రెస్ పార్టీ విధానం.. కర్ణాటకలో ఒక చిన్న గ్రామంలో పుట్టి.. రజాకార్ల దాడులలో తండ్రిని కోల్పోయి కార్మిక నాయకుడిగా రాణించి.. జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే.. 60 ఏళ్లుగా ఒకరోజు కూడా విరామం లేకుండా ఆయన ప్రజలకోసం పనిచేస్తున్నారు" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు."ఉత్తరాఖండ్ లో ఒక మైదానంలో జరిగిన సభలో మల్లికార్జున ఖర్గే పాల్గొంటే.. ఆగస్టు 10 న బీజేపీ అనుబంధ సంస్థ ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం హేయమైన చర్య.. దీన్ని ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది. ఈ ఘటనపై ఖర్గే రాజ్యసభలో భావోద్వేగంతో ప్రధానిని అడిగి కడిగి తీసుకోవాలని కోరారు.

## ఫాంహౌస్‌లో కుట్రపై
# సమగ్ర విచారణ

**: సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్ 9 : బీఆర్ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. సభను అడ్డుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. మూడు రోజుల ఘటనలకు ఫాంహౌస్ సాక్షిగా కుట్ర జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీ ఘనటలపై విచారణకు ఆదేశించామని అన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని.. చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిని.. కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని అన్నారు.ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్‌ను నియమించామని వెల్లడించారు.

## సబితపై పోలీసుల దాడి వీడియోలను
# గవర్నర్‌కు చూపించాం

**: కేటీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణలో పరిస్థితులను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వివరించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఈరోజు(బుధవారం) గవర్నర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు, కేసీఆర్ ఇంటి వద్ద కాంగ్రెస్ చావు డబ్బు, తదితర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీకి వెళ్తుంటే నడిరోడ్డుపై అడ్డుకున్నారని మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడి వీడియోలను గవర్నర్‌కు చూపించామన్నారు.ఎమ్మెల్యే సునీత చీరను లాగి దుశ్శాసనపర్వం ఎలా సృష్టించారో చెప్పామని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీ తరహాలోనే బ్లాక్ టీషర్ట్ వేసుకున్నామని చెప్పారు. స్పీకర్ అంటే తమకు గౌరవం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలకే కాదు.. ప్రజాప్రతినిధులకూ అవమానాలే అని అన్నారు. ముఖ్యమంత్రి ప్రేరేపించడం వల్లే మాజీ సీఎం కేసీఆర్ ఇంటి వద్దకు కాంగ్రెస్ శ్రేణులు వేల సంఖ్యలో మోహరించి చావు డబ్బు కొట్టారని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు.

## తెలంగాణలో బీజేపీ గెలుపును
# ఎవ్వరూ ఆపలేరు

**: బండి సంజయ్**

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9: తెలంగాణలో బీజేపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈరోజు(బుధవారం) భద్రాచలంలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి.. బీజేపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల తరువాత బీజేపీ అధిష్ఠానం టార్గెట్ తెలంగాణ అని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి బీజేపీ కార్యకర్త పై అక్రమ కేసులు పెట్టి వేధించారని మండిపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని



ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇచ్చే ఇళ్లు, సన్న బియ్యాన్ని కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్ మెడలు వంచింది బీజేపీ పార్టీ అని అన్నారు. రజాకార్ల పాలన కంటే ఘోరమైన కేసీఆర్ పాలనలో బీజేపీ కార్యకర్తలు కొట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశాన్ని ఏలిన కాంగ్రెస్ నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని.. కార్యకర్తలు పోలీసు కేసులకు భయపడొద్దని అన్నారు. 'నాపై 109 కేసులున్నా వెనుకడుగు వేసేది లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఇక యుద్ధం చేయాలి. గడప గడపకు బీజేపీ కార్యకర్తలు వెళ్లాలి' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు సభ్య
# సమాజానికి అవమానకరం

**: భట్టి విక్రమార్క**

హైదరాబాద్, సెప్టెంబర్ 9: కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 'శుద్ధి' అంశం తెలంగాణ అసెంబ్లీలో తీవ్ర రచ్చకు దారి తీసింది. బీఆ రఎస్ తీరుపై మంత్రులు మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడం, నిరసన ప్రాంతాన్ని శుద్ధి చేయడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సభాపతిని అందరూ గౌరవిం చాలని అన్నారు. పదేళ్లు మంత్రులుగా చేసిన వారు స్పీకర్‌ను అగౌరపరిచేలా వ్యవహరించడం సరికాదని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు సభ్య సమాజానికి అవమా నకరమని.. వారు చేసిన అవమానాలు ఇక చాలని ఉపముఖ్య మంత్రి అన్నారు. కా భరించే



ఓపిక సమాజానికి లేదని తెలి పారు. దళితులు తిరిగారని రోడ్లపై పసుపు నీళ్లు చల్లుతారా అంటూ ఫైర్ అయ్యారు. 'మనం ఏ సమాజంలో ఉన్నాం.. మీ ఛాలెంజ్‌లకు, బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరు. బీఆర్ఎస్ సభ్యులు ఎవరిని బెదిరిస్తున్నారు. ఎంత కాలం దాడులు చేస్తారు. ఇది ఆత్మగౌరవ సమస్య. ఇంకా అవమానాలు భరించడానికి మేము సిద్ధంగా లేము. ఈ ప్రభుత్వం స్పీకర్‌కు అండగా నిలబడుతుంది' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.'మీకు ఏం కావాలో లిఖిత పూర్వకంగా ఇవ్వండి. కేసీఆర్ బాగుం డాలని కోరుకుంటున్నాం. వందేళ్లకు పైగా జీవిం చాలి.. సమాజానికి తన సేవలు అందించాలని కోరుకుం టున్నాం. కాంగ్రెస్ పార్టీ ఎవరి చావు కోరుకోదు. దళితులు నడిచిన చోట బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారు. మనం ఏ యుగంలో బతుకుతున్నాం. దళితులు నడిస్తే శుద్ధి చేస్తారా? ఈరోజు సహకరించాలి.

## సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలతో
# ఇలా ప్రవర్తిస్తారా

**: బీఆర్ఎస్‌పై సీతక్క ఫైర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. ఈ రోజు(బుధవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ సభ్యులు అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. దీనికి సంబంధించిన విజువల్స్‌ను మంత్రి విడుదల చేశారు.బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని వెనుక నుంచి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి తోసేశారని మంత్రి తెలిపారు. గంగుల కమలాకర్.. మహిళా ఎమ్మెల్యేలను వెనుక నుంచి నెట్టుకుంటూ ముందుకు వచ్చారన్నారు. పక్కపక్కన నిలుచున్న ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలను తాకుకుంటూ సుధీర్ రెడ్డి మధ్యలోకి వచ్చారన్నారు. ఇద్దరు మహిళా సభ్యుల మధ్యకు చొరబడాల్సిన అవసరం ఏంటి అని ప్రశ్నించారు. మహిళా నేతలను అతుక్కుని ఎందుకు నిలబడ్డారని నిలదీశారు.


## తెలంగాణ గవర్నర్ దృష్టికి అన్ని విషయాలు.. !!



హైదరాబాద్, సెప్టెంబర్ 9 :శాసనసభ సమావేశాల నేపథ్యంలో తెలం గాణలో రాజకీయాలు ఒక్కసారిగా వేడె క్కా యి. సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య చెలరేగిన వివాదం రోడ్డుకెక్కింది. అసెంబ్లీ ప్రస్తుత సమావేశాల నుంచి తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసింది. ఈ రెండు రోజులుగా చోటుచేసుకుంటూ వస్తోన్న పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది.సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యేలతో కలిసి గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. సభలో తమకు జరిగిన అన్యాయాన్ని, ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘనను వివరించారు. ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలు, హామీలపై తాము ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే ఈ కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించిన తమ ప్రజాప్రతినిధులపై సస్పెన్షన్ వేటు వేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు.శాసనసభ, బయట చోటు చేసుకున్న అవాంఛనీయ పరిణామాలపై గవర్నర్‌కు తాము పూర్తి ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించినట్లు కేటీఆర్ వెల్లడించారు. మైకులు కట్ చేసి, తమ గొంతు నొక్కే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన గవర్నర్.. వెంటనే డీజీపీతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. గవర్నర్ హామీతో తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందని చేశారు.

## కలెక్టర్ల సదస్సు.. 19 అంశాలపై
# సీఎం చంద్రబాబు స్పెషల్ ఫోకస్

అమరావతి, సెప్టెంబర్ 9 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రేపు (గురువారం) 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరుగనుంది. జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల పాటు ఈ సమావేశం నిర్వహిం చనున్నారు. రేపు (గురువారం), ఎల్లుండి (శుక్రవారం) రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేస్తారు.జీఎస్డీపీ, సూపర్ సిక్స్, తాగునీరు, గృహనిర్మాణం, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై మొదటిరోజు ముఖ్యమంత్రి చర్చించనున్నారు. రెండోరోజు ఈ- గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర నిధుల వినియోగంతో పాటు పలు అంశాలపై సీఎం సమీక్షిం చనున్నారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు.7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు



సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా ముఖ్యమంత్రి సమీక్షిం చనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై కలెక్టర్లకు సీఎం మార్గనిర్దేశం చేస్తారు.మొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సీఎం చంద్రబాబు సమీక్షిస్తారు. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యారంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రద ర్శిస్తారు. రెండో రోజు సదస్సులో ఈ- గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీగా ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

# కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రొమ్ము క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ శిబిరం ప్రారంభం

**సంగారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ముందస్తు నిర్ధారణ (స్క్రీనింగ్) శిబిరాన్ని సహాయ కమిషనర్ (ఏసీఎల్) పాండు బుధవారం ప్రారంభించారు. ఏఐజీ ఆసుపత్రి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. లలితాదేవి మాటాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే సకాలంలో మెరుగైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని తెలిపారు. మహిళలు ఎలాంటి అనుమానాస్పద లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి ఉచిత నిర్ధారణ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల్లో క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని అరికట్టడమే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు కొనసాగుతాయని అధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో అసాంక్రమిక వ్యాధుల నివారణాధికారి డాక్టర్ ఎం. దీప్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు అధికారి డాక్టర్ బాలరాజ్, కంది మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ సాయి శ్రీరామ్, వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చేగుంటలో టెన్షన్ టెన్షన్

## రోడ్డెక్కిన ఉప సర్పంచ్ రఫీ




**చేగుంట, సెప్టెంబర్ 9 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మౌన దీక్షకు దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని దీక్షను అడ్డుకున్నారు. అనుమతి లేకుండా రోడ్డుపై దీక్ష చేయడం సరికాదని హెచ్చరించి దీక్షను విరమిం పజేశారు.

అనంతరం ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం తన పోరాటం కొనసాగుతుందని రఫీ తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో

## కర్నాల్ పల్లిలో 6వ మెగా హెల్త్ క్యాంప్



**చేగుంట , సెప్టెంబర్ 9 మెదక్ టుడే న్యూస్**

లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో 200వ ప్రోగ్రాం లో భాగంగా 6వ మెగా ఉచిత హెల్త్ క్యాంప్ ను కర్నాల్ పల్లి గ్రామంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మల్లారెడ్డి హాస్పిటల్, సూరారం సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మల్లారెడ్డి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అనిరుద్, డాక్టర్ పూజిత, మార్కెటింగ్ మేనేజర్ హరి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాజనకు రామచంద్రం, డిస్ట్రిక్ట్ హెల్త్ క్యాంప్స్ చైర్మన్ స్వర్గం సిద్ధిరాములు పర్యవేక్షణలో క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్ లో సుమారు 185 మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణ, ముందస్తు పరీక్షల ఆవశ్యకతపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, హెల్త్ క్యాంప్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ స్వర్గం సిద్ధిరాములు, ఫాస్ట్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, సభ్యులు అంబటి సురేష్, సర్పంచ్ దుర్గరాములు గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు రాజనకు రామచంద్రం మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు.

# బీరంగూడ గుట్ట శ్రీ మల్లికార్జున స్వామి

## హుండీ ఆదాయం రూ.13.69 లక్షలు

- 200 రోజులకు గాను లెక్కింపు పూర్తి
- ఆలయ అభివృద్ధికి నిధుల వినియోగం: ఈవో దేవనాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. గత 200 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.13,69,009 (పదమూడు లక్షల అరవై తొమ్మిది వేల తొమ్మిది రూపాయలు) ఆదాయం లభించినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. సంగారెడ్డి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ప్రత్యక్ష సమక్షంలో, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) దేవనాదం, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది, భక్తుల సహకారంతో పారదర్శకంగా లెక్కింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఈవో దేవనాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. భక్తులు హుండీ ద్వారా సమర్పించిన ప్రతి రూపాయిని ఆలయ సర్వతోముఖాభివృద్ధి, భక్తుల మౌలిక వసతుల కల్పన కోసమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని, ఆలయ అభివృద్ధిలో స్థానిక భక్తులు, దాతల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొని సహకరించిన మహిళా భక్తులకు, స్వచ్ఛంద సేవకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఎల్లయ్య, శ్రీనివాస్, మహేష్, దీపక్ గౌడ్, రమేష్ యాదవ్,సురేష్ నాయక్,ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పటిష్ఠ బందోబస్తుతో ప్రశాంతంగా మిలాద్-ఉన్-నబీ

- ఎస్పీని సన్మానించిన జమాత్-ఇ-ఇస్లామీ ప్రతినిధులు

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:**

మిలాద్-ఉన్-నబీ పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన పటిష్ఠ బందోబస్తు విజయవంతం కావడంతో జమాత్-ఇ-ఇస్లామీ ప్రతినిధులు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపిఎస్‌ను కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పండగ సందర్భంగా ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, ఊరేగింపు మార్గాలు, సున్నిత ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి నిరంతరం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ,జిల్లాలో మిలాద్-ఉన్-నబీ పండగ ప్రశాంతంగా ముగియడం సంతోషకరమన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతోపాటు మత పెద్దలు, ప్రజలు అందిం చిన సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించిన మత పెద్దలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలి పారు. భవి ష్యతులోనూ అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో పండగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.




# రాజీ మార్గమే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:**

చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అవగాహనతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఎస్పీ తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక వివాదాలు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, సైబర్ సంబంధిత రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా చట్టపరమైన నిబంధనల మేరకు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. వివాదాలను కక్షలుగా మార్చుకుని ఇరువర్గాలు సమయం, ధనం కోల్పోవద్దని ఎస్పీ సూచించారు. రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని గుర్తించి లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి సంబంధిత పక్షాలకు అవగాహన, కౌన్సెలింగ్ కల్పిస్తూ పరిష్కారానికి పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కృషి చేస్తారని తెలిపారు. కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.




# సామాజిక బాధ్యతను చాటిన ప్రజాకవి

- పుట్టుక నీది.చావు నీది. బతుకంతా దేశానిది
- కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:**

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సాహిత్య, సామాజిక సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పుట్టుక నీది. చావు నీది. బతుకంతా దేశానిది అంటూ కాళోజీ తన కవిత్వం ద్వారా ప్రతి ఒక్కరిలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించారని అన్నారు. ప్రజల సమస్యలను నిర్భయంగా తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజాకవిగా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబరు 9న జన్మించారని, సాహిత్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు పద్మవిభూషణ్, సాహిత్య అకాడమీ అవార్డు తదితర ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయని ఎస్పీ తెలిపారు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు.

కాళోజీ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆయన రచనలు సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, సీఐ లు జర్జ్, సందీప్ రెడ్డి, ఆర్ఐ రామ కృష్ణ, ఎస్సై లు , సిబ్బంది పాల్గొన్నారు.



# చదువుతో పాటు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరం

- 200 మంది విద్యార్థులకు ఏబీసీ 3.0 అవగాహన
- నన్ను నేను తెలుసుకోవడం.. వ్యక్తిత్వ వికాసం.. బాధ్యతాయుత ప్రవర్తనపై ప్రత్యేక శిక్షణ
- జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:**

చదువుతో పాటు విద్యార్థులకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని, తద్వారా వారు తమ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి అన్నారు. బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏబీసీ 3.0 అవగాహన కార్యక్రమాన్ని మెదక్ పట్టణంలోని గవర్నమెంట్ బాయ్స్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమ భార్గవి మాట్లాడుతూ నన్ను నేను తెలుసుకోవడం,వ్యక్తిత్వం, వ్యక్తిత్వ వికాసం, బాధ్యతాయుత ప్రవర్తన, సరైన నిర్ణయాలు తీసుకోవడం, తమ బలాలు--బలహీనతలను గుర్తించడం తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా స్వతంత్రంగా ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థులను చైతన్యపరిచామన్నారు. పిల్లల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై విద్యార్థులకు వివరించారు. బాలలకు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా సంబంధిత సహాయ వ్యవస్థలను ఆశ్రయించాలని సూచించారు విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. చిన్న వయస్సు నుంచే సరైన ఆలోచనా విధానం, బాధ్యతాయుత ప్రవర్తన అలవర్చుకుంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగగలరని పేర్కొన్నారు. లైఫ్ స్కిల్స్ ట్రైనర్, ఏబీసీ 3.0 ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత రాకేష్ కొర్రపాటి మాట్లాడుతూ, విద్యార్థుల్లో కేవలం సమాచారాన్ని పెంచడం మాత్రమే కాకుండా, వారి ఆలోచనా విధానంలో సానుకూల మార్పు తీసుకురావడమే ఏబీసీ 3.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమను తాము అర్థం చేసుకుని, తమ సామర్థ్యాలను గుర్తించి, జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేలా జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అవగాహనతో ఆలోచన మారాలి.. ఆలోచనతో ప్రవర్తన మారాలి. ప్రవర్తనతో భవిష్యత్తు మారాలి" అనే లక్ష్యంతో ఏబీసీ 3.0 కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మల్లేశం ఉపాధ్యాయులు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



# పోలీస్ సంఘం ఎన్నికల్లో అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అంబర్ సింగ్ ఘన విజయం

- జోనల్ డీసీపీ, అడిషనల్ డీసీపీలను మర్యాదపూర్వకంగా కలిసిన అంబర్ సింగ్
- పోలీసుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటా: అంబర్ సింగ్

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 09: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ సంఘం ఎన్నికల్లో అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అంబర్ సింగ్ అఖండ విజయం సాధించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ స్థానానికి జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 84 ఓట్లకు గాను ఏకంగా 74 ఓట్లను సాధించి భారీ మెజార్టీతో విజయం దక్కించుకున్నారు. ఈ విజయం సాధించిన అనంతరం ఆయన జోనల్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ ఉదయ్ కుమార్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి ఆశీస్సులు తీసుకున్నారు. అందరి సహకారంతోనే విజయం: అంబర్ సింగ్ఈ సందర్భంగా అంబర్ సింగ్ మాట్లా డుతూ.. ఇంతటి ఘన విజ యాన్ని సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నా గెలుపున కు పూర్తి సహ కారం అందించిన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ప్రవీణ్ రెడ్డి సార్‌కు, ఎస్ఐలకు, ఏఎస్ఐలకు, తోటి పోలీస్ సిబ్బం దికి, అలాగే నాపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్క మిత్రునికి పేరుపేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజే శారు. రాబో యే రోజుల్లో పోలీసుల సమస్యల పరిష్కా రానికి, వారి సంక్షేమానికి ఎల ్లప్పుడూ ముం దుండి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



మెదక్ టుడే దిన పత్రిక
గురువారం, సెప్టెంబర్ 10, 2026

## మనం అంగన్వాడి -మన బాధ్యత



- తొమ్మిదవ జాతీయ పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:** మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడుతూ,
మనం అంగన్వాడి -మన బాధ్యత అని ,సెప్టెంబరు 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ మాసంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.మాతా,శిశు సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిశీలనకు 'పోషణ్ అభియాన్'ను నిర్వహిస్తున్నామన్నారు. వారు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలివ్వడం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు.అనంతరం 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఈఓ రాజు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## నిత్యశ్రీ నీ అభినందించిన జిల్లా కలెక్టర్




**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:** కరాటేలో 16 స్టేట్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ ,4 ఛాంపియచీప్లు సాధించిన మెదక్ పట్టణానికి చెందిన నిత్యశ్రీ ని అభినందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని విద్యార్థికి సూచించారు.
నగేష్ మల్లూరి సారధ్యంలో శిక్షణ తీసుకొని పతకాలన్నీ సాధించానని,ఇంటర్నేషనల్ బ్రూస్లీ ఐకాన్ అవార్డ్ సైతం సొంతం చేసుకున్నానని నిత్యశ్రీ అన్నారు.

# సీతాఫల్‌మండి టీఆర్ టీ కాలనీలో అక్రమ నిర్మాణాలు

- జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి.?
- అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందని స్థానికుల ఆరోపణలు
- ఫిర్యాదులు ఉన్న అధికారుల చర్యలు ఎందుకు లేవని ప్రశ్నలు
- వర్క్ ఆపాలని నోటీసులు ఎక్కడ మున్సిపల్ చట్టం అందరికీ ఒకటే కాదా.?
- విజిలెన్స్ విచారణ చేపట్టి వాస్తవాలు వెల్లడించాలని స్థానికుల డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్,9, (మెదక్ టుడే)** సీతాఫల్‌మండి టిఆర్ టి కాలనీలో జరుగుతున్న ఓ అక్రమ నిర్మాణం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ నిర్మాణం అనుమతులకు పూర్తి విరుద్ధంగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు కనీస చర్యలు కనిపించ కపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఒకవేళ
నిర్మాణం అనుమతుల ప్రకారం జరుగుతుంటే ఆ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, నిర్మాణదారుడు నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అయితే స్థానికుల ఫిర్యాదులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు అధికారులు అమ్ముడుపోయారనే సందేహాలను పెంచుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సాధారణంగా అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం స్టాప్ వర్క్ నోటీసులు, షోకాష్ నోటీసులు అవసరమైతే సీజ్ నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ అక్రమ నిర్మాణం విషయంలో అలాంటి చర్యలు తీసుకున్నారా. లేదా. లేకుంటే ఎందుకు తీసుకోలేదు. అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి లంచాలు తీసుకున్నారా. అనే విషయంపై అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఒకవేళ నోటీసులు జారీ చేసి ఉంటే వాటి వివరాలను బహిర్గతం చేయాలని, చేయకపోతే కారణాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
తెలంగాణ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని పలుమార్లు ప్రకటించింది. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న నేపథ్యంలో ఈ అక్రమ నిర్మాణంపై కూడా అదే ప్రమాణాలు అమలు అవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణ ప్రజల విషయంలో వెంటనే చర్యలు తీసుకుంటూ బడా బాబుల, బిల్డర్ల విషయంలో అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నారని భావన ప్రజల్లో ఏర్పడితే కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్, జోనల్ సిపి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్రణాళిక, స్థల పరిశీలన నివేదిక, ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు పత్రికా ముఖంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.
నిర్మాణదారుడు చట్ట ఉల్లం ఘనలు ఉన్నట్లు తేలితే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
సీతాఫల్ మండి టి ఆర్ టి కాలనీలో పక్కింటి నెంబర్ 80 జరుగుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణంపై స్టేట్ విజిలెన్స్ అధికారులు చేసమగ్ర విచా రణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలి యజే సి అక్రమ నిర్మాణం అని తేలితే కూల్చి వేతలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత తార్నాక సర్కిల్ టౌన్ ప్లానిం గ్ అధికారులపై ఉందని స్థానికులు పేర్కొ ంటున్నారు.

## కాళోజి సేవలు చిరస్మరణీయం



- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:** తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని జిల్లా అధనపు కలెక్టర్ నగేష్ అన్నా రు.బుధవారంప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భ ంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి డి.ఆర్వో అంబదాస్ రాజేశ్వర్ , బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్ ఎస్సీ సంక్షేమ అధికారి సింధు కలెక్టరేట్ కార్యా లయ సూపరిండెంట్లు తో కలిసి అదనపు కలెక్టర్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భ ంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడు తూ,తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ తెలంగాణ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

**మెదక్,సెప్టెంబర్,9,మెదక్ టుడే న్యూస్:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భ ంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించి, జిల్లాలలో పర్యాటక ప్రదేశాల




ప్రచారం, అభివృద్ధి కోసం ఆసక్తి కలిగిన యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.యువ టూరిజం క్లబ్‌ల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాలలో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని తెలిపారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని, ఇందు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని తెలిపారు.గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి, కేంద్రీకృత సేకరణ లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా టూరిజం అధికారి రమేష్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చావును కోరడం దారుణం

### ముమ్మాటికీ ఇది కాంగ్రెస్ ప్రభుత్వ సర్కార్ కుట్రే

హైదరాబాద్ రాష్ట్రానికి విశేష సేవలు అందించిన కేసీఆర్ చావును కోరడం దారుణమని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మండిపడ్డారు. దీని వెనుక ప్రభుత్వ కుట్ర ఉన్నదని విమర్శించారు. చావుడప్పు చాటింపు మంచి సంప్రదాయం కాదని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ముమ్మాటికీ ఈ చర్యను ప్రేరేపించిన వా రిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం శాసనమండలిలో మధుసూదనాచారి మాట్లాడారు.ఎమ్మెల్సీ ల సస్పెన్షన్ వ్యవహారంలో ప్రభుత్వం తన తప్పును తెలుసుకొని యావత్ తెలంగాణ స మాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభ ఉన్నత విలువలు పాటించాలని చెప్పారు. తమ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారని, నిన్న సభలోకి వస్తే వారికి మాట్లాడే



అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. వెంటనే తమ సభ్యుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, వాళ్లు సభలోకి వచ్చేవరకు తమ నిర సన కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ఇది ప్రీ ప్లాన్డ్ కుట్ర అని, సస్పెన్షన్ తీర్మానంపై చర్చ జరుగాలని సిరికొండ డిమాండ్ చేశారు.

## కేసీఆర్ నివాస ముట్టడిపై ఆగ్రహం

**గజ్వేల్:** కేసీఆర్ నివాసాన్ని ముట్టడించేందుకు తరలివచ్చిన కాంగ్రెస్ నాయకుల తీరుపై గ్రామాల్లో ఆగ్రహం పెల్లుబుకింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని మర్కూక్, ఎర్రవల్లి, శివారువెంకటాపూర్, బావానందపూర్, గంగాపూర్ గ్రామాల్లో బుధవారం గ్రామస్తులు, మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలతో ప్రధాన చౌరస్తాల వరకు ర్యాలీగా వెళ్లి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాజకీయ వార్తలు చదవండికేసీఆర్ పదేండ్ల పాలనలోనే తమ గ్రామాలు అభివృద్ధి చెందాయని, కాంగ్రెస్ వచ్చిన రెండున్నరేండ్లలో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులకు పోలీసులు రక్షణ కవచంలా నిలబడి కేసీఆర్ నివాస ముట్టడికి



ర్యాలీని అనుమతించడం ఏందని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన 420 హామీలను అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దాటవేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పదేండ్లలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో 30ఏండ్లు ముందుకెళ్తే కాంగ్రెస్ మాత్రం అభివృద్ధిని నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. ఇక్కడి
నుంచి ఉమ్మడి నల్లగొండతోపాటు సంగారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు కేసీఆర్ సాగు, తాగు నీటిని అందించారని కొనియాడారు.

# అసెంబ్లీలో ఏలేటి వ్యాఖ్యలపై దుమారం - విరుచుకుపడ్డ మంత్రులు



**హైదరాబాద్ :** బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీలో దుమారం రేగింది. సభలోలేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. సభ ఉల్లంఘున జరిగినప్పుడు బీజేపీశాసనసభపక్ష నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అసెంబ్లీలో పేర్కొన్నారు. ఏ నియమ నిబంధనల ప్రకారంగా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. కొత్తగా ఏమైనా పుస్తకం తయారు చేసుకున్నారా ప్రశ్నించారు. గ్రామాల్లో ఏడు గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి రూల్ బుక్ నడుస్తుందా అడిగారు. బీఏసీలో చెప్పినట్లు సభ నడుపుతారా లేదా రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ పై ఎప్పుడూ చర్చిస్తారో చెప్పే వరకు సభలో మా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. "సభలో లేనివారిని సస్పెండ్ చేయడం దారుణం. ఇష్టానుసారం సస్పెండ్ చేయడం బాధాకరం. రైతు సమస్యలపై చర్చ ఉంటుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. బీఏసీలో చెప్పిన ప్రకారం సభ నడుపుతారా?" – ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేతగౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలి : సభ ఔన్నత్యాన్ని కాపాడటం మనందరి బాధ్యతన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ స్థానంలో ఉన్న వారి గౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీ సభ్యులకు ఇష్టంలేనట్లుంది : ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న మంత్రి శ్రీధర్‌బాబు సభ కార్యక్రమాలను నిరంతరం అడ్డుకోవడం సమంజసమా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళిత వర్గాలు, బలహీనవర్గాల హక్కులను కాపాడాలని సూచించారు. సామాజిక న్యాయం చేయాలని లేకపోతే ఏమనాలని ప్రశ్నించారు. విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, 22ఏ సమస్యపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నామని వెల్లడించారు. వారిని సమర్థించడం మంచి పద్ధతి కాదు : బీజేపీ సభ్యుల వైఖరి మార్చుకుంటేనే మరింత ఎదుగుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. దళితులను అవమానించినవారిని సమర్థించడం మంచి పద్ధతి కాదని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడితే వారిని మెచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఎందుకు శుద్ధి చేశారో చెప్పండి : సభ సజావుగా జరగడం బీజేపీ సభ్యులకు ఇష్టంలేదన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభ్యసమాజం తలదించుకునేలా స్పీకర్‌పై ఇష్టానుసారం మాట్లాడతారా అని నిలదీశారు. నిరసన కార్యక్రమం చేస్తుంటే శుద్ధి చేయడం మంచి పద్ధతా? అని ప్రశ్నించారు. ఎర్రవల్లిలో దళితులు కార్యక్రమం చేసిన చోట శుద్ధి చేయడాన్ని ఏమనాలని?, ఖర్గే కూర్చున్న వేదికను ఎందుకు శుద్ధి చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులను డిమాండ్ చేశారు. అప్పుడే సభకు వస్తాం : శాసనసభ నుంచి బీజేపీ వాకౌట్ చేసింది. ప్రభుత్వం అజెండా అంశాలను ముందే ఇవ్వట్లేదని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపింటారు. స్పష్టమైన అజెండా ఇచ్చిన తర్వాతే సభ వస్తామని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## 'ఒకరి చావు కోరడం సమర్థనీయం కాదు'.. కేసీఆర్‌పై వ్యాఖ్యలకు ఎమ్మెల్యే వివరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:**



మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరణ ఇచ్చారు. (బుధవారం) మీడియాతో మా ట్లాడుతూ. ఒకరి చావు కోరడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ముఖ్యమంత్రిని, దళిత అసెంబ్లీ స్పీకర్‌ను, మహిళా మంత్రులను అసభ్యకరంగా కులాల పేరుతో దూషిస్తూ వ్యక్తిగతంగా బూతులు తిడుతున్నారని మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని.. స్పీకర్‌ను అసభ్యపదజాలంతో దూషించారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కడుపు మండి కేసీఆర్ వెంటనే అసెంబ్లీకి రావాలని, సమస్యలపై చర్చించాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని.. కేసీఆర్ కుటుంబ ఒక్కరిదే కాదని ఎమ్మెల్యే అన్నారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంపై, వారి కుటుంబ సభ్యులపై బూతులు తిడుతున్నారని ఫైర్ అయ్యారు. 'మీ ఇంట్లో కూడా ఆడబిడ్డలు ఉన్నారు కదా. వారి ముందు ఇలా మాట్లాడుతారా. టీవీలలో మీ బూతులు వినలేక మహిళలు చెవులు మూసుకుంటున్నారు. మీ కుటుంబ సభ్యులు కూడా ఆ మాటలు వినలేక తలదించుకుంటున్నారు' అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తలిపారు. అలాగే, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ కుమారుడు రాహుల్ గాంధీపై 'ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ' అని మూడు రోజుల క్రితం కరీం నగర్‌లో కేటీఆర్ మాట్లాడిన వీడియోలను ఈ సందర్భంగా మీడియాకు ఎమ్మెల్యే విడుదల చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త.. పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. 2వ వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. ఈ మేరకు రెండో పీఆర్సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌కు లేఖ రాశారు. గతంలో నియమించిన రెండో వేతన సవరణ కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పీఆర్సీ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. బకాయి ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశాలపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పీఆర్సీ కమిషన్ వేగంగా నివేదిక సమర్పిస్తే.. దాని ఆధారంగా ఉద్యోగుల వేతన సవరణపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కమిషన్ నివేదిక అందిన తర్వాత ఫిట్‌మెంట్, వేతన సవరణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పీఆర్సీ ప్రక్రియపై ఉద్యోగుల్లో మరోసారి ఆశలు నెలకొన్నాయి.

# తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డిని కూడా సస్పెండ్ చేశారు

**హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ వేటుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని తీవ్రంగా అభాసుపాలు చేస్తోందని, ప్రజా సమస్యలు, కీలకమైన జీవో 97, 22-ఏ వంటి అంశాలపై చర్చ జరగకుండా తప్పించుకునేందుకే విపక్ష సభ్యులను సస్పెండ్ చేస్తోందని ఆరోపించారు. సభకు రాకుండా తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డితో పాటు, సభలో లేని పద్మారావు గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, కేటీఆర్, గంగుల కమలాకర్ పేర్లను కూడా సస్పెన్షన్ జాబితాలో చేర్చడం శాసనసభా చరిత్రలోనే హాస్యాస్ప దమని వ్యాఖ్యానించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి చదివిన జాబితా ఒకటైతే, స్పీకర్ ప్రకటించిన పేర్లు మరో విధంగా ఉన్నాయని తప్పుబట్టారు. తెలంగాణ సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్



చావును కోరుకుంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మె ల్యేపై

ఎలాంటి సస్పెన్షన్ వేటు వేయకుండా సభలోనే కూర్చోబెట్టుకున్నారని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే బీఆర్ఎస్‌కు ఎంతో గౌరవం ఉందని, ఆయనపై గౌరవంతోనే నాడు స్పీకర్ ఎన్నికలో అభ్యర్థిని కూడా నిలబెట్టలేదని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ నాయకులు నిత్యం 'దళిత స్పీకర్' అని వర్గీకరిస్తూ ఆయన ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఏఐ ఫేక్ ఫొటోలతో బీఆర్ఎస్ నేతలను నెగెటివ్‌గా వైరల్ చేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు వెళుతుంటే తమ నేతలను అరెస్ట్ చేయడం, జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడటం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని తలసాని ధ్వజమెత్తారు.

# హైదరాబాద్‌లో మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్ నెలవారీ ధర రూ.7,500

**హైదరాబాద్:** మహానగర ప్రయాణికులకు ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తూ తెలంగాణ రవాణా శాఖ సరికొత్త ఉమ్మడి రవాణా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న ప్రయాణ టికెటింగ్ వ్యవస్థలను అనుసంధానిస్తూ, మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ఒకే పాస్‌తో ప్రయాణించే వీలును కల్పించే అవకాశాలను పరిశీలిస్తుంది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ వినూత్న ఉమ్మడి రవాణా కార్డును అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వంతో కలిసి ఆర్టీసీ యాజమాన్యం రంగం సిద్ధం చేస్తోంది. మూడు కేటగిరీలలో పాస్?లు : ప్రయాణికుల విభిన్న అవసరాలకు అనుగుణంగా ఈ ఉమ్మడి పాస్‌లను మూడు




కేటగిరీలలో రూపొందించారు. కేవలం ఒక్క రోజు ప్రయాణించే వారి కోసం రోజువారీ పాస్, వారానికి ఒకసారి అవసరమయ్యే వారి కోసం వీక్లీ పాస్, నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థుల కోసం నెలవారీ పాస్ విధానాన్ని అమల్లోకి తీసుకు రానున్నారు. ఇందులో భాగంగా నెలవారీ పాస్ ధరను ప్రాథమికంగా రూ.7,500గా నిర్ణయిస్తూ ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి తుది నివేదికతో పాటు ఛార్జీల ప్రతిపాదనలను సమర్పించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు : ఈ సరికొత్త పాస్ ద్వారా భాగ్యనగర ప్రయాణికులు మెట్రో సర్వీసులతో పాటు, ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే ఆర్డినరీ సర్వీసుల నుంచి మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల వంటి వాహనాలలో ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఈ సౌకర్యం నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు చెల్లుబాటు అవుతుంది. అయితే, ప్రాథమిక దశలో కేవలం మెట్రో, ఆర్టీసీ సేవలకు మాత్రమే దీనిని పరిమితం చేశారు. హైదరాబాద్?లో నడిచే ఎంఎంటీఎస్ (వీమీూ) లోకల్ రైళ్లను, సెట్విన్ బస్సులను ప్రస్తుతానికి ఈ ఉమ్మడి కార్డు పరిధిలోకి తీసుకురాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ స్మార్ట్ కార్డ్ విధానం అమలులోకి వస్తే టికెట్ల కౌంటర్ల వద్ద నిరీక్షణ తగ్గడంతో పాటు, మెట్రో, బస్సులలో మధ్య మారే ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

## హైదరాబాద్ నారాయణ కాలేజీ విద్యార్థిపై క్లాస్‌మేట్స్ దాడి, కేసు నమోదు

**హైదరాబాద్ :**



హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన 16 ఏళ్ల విద్యార్థిపై సహ విద్యార్థులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంతోష్‌నగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో అబ్దుల్ రెహమాన్ బిన్ ఖలీద్ (16) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం పరీక్ష పత్రాలకు సంబంధించిన విషయంలో అతడికి, మరో ముగ్గురు సహ విద్యార్థులకు మధ్య వివాదం నెలకొంది. కళాశాల సిబ్బంది జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగేలా చేసి విద్యార్థులను ఇళ్లకు పంపించివేశారు. అయితే, కాలేజీ ముగిసిన తర్వాత ఇద్దరు విద్యార్థులు అబ్దుల్ రెహమాన్‌ను అడ్డగించి, ఫైట్ చేయాలంటూ సవాల్ విసిరారు. దీంతో అతను సంతోష్‌నగర్‌లోని 7బి గ్రౌండ్‌కు వెళ్లాడు. అక్కడ నిందితుల్లో ఒకరు అతడిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని అప్నా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి ఖలీద్ బిన్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐఎస్ సదన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## రాయదుర్గంలో పాలిటెక్నిక్ విద్యార్థుల మెరుపు ధర్నా

**కొండాపూర్, సెప్టెంబర్ 9 :**




పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థులు రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో రాస్తారోకో చేపట్టారు. జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని, తమ విద్యా భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రాయదుర్గంలోని లిడ్క్యాప్ ముందున్న జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని విద్యార్థులు ఆరోపించారు. తమను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల పాటు కష్టపడి చదివే తమ విద్యా కాలం, భవిష్యత్తు అనిశ్చితిలో పడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళన విరమించాలని పోలీసులు సూచించినప్పటికీ విద్యార్థులు వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో పలువురు విద్యార్థులపై పోలీసులు చేయి చేసుకున్నారని విద్యార్థులు ఆరోపించారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ - హరీశ్‌రావు, కేటీఆర్‌తో సహా 22 మంది

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసన సభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్? అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటన : మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి



వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. సభ సజావుగా నడిచేలా : సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడా లన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమా నాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. న్యాయం కావాల్సింది బలహీ నవర్గాలకు : నిరసనలో భాగంగా దళిత సంఘా లు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..